# రాకోయి బంగారుమామ

అవని చిన్నపట్నుంచీ చాలా అణకువగల పిల్ల. వాళ్ళయిరుగూ పొరుగూ, మిగిలిన ఆడపిల్లలు ఏమైనా దురుసుగా ప్రవర్తిస్తే, " ఆ అవనిని చూసి నేర్చుకోండి!" అనేవారు. అణకువ గల పిల్లకదా అని చదువు సంధ్యలు లేనిది మాత్రం కాదు. ఈ పిల్లలోని అణకువ ఆనంద్ నాన్నగారికి చాలా నచ్చింది. అందుకే ఆనంద్‌కి కట్టబెట్టారు.

ఆనంద్‌కి హైదరాబాద్‌లో ఉద్యోగం. మధ్యమధ్యలో ఆఫీసు పనిమీద బయట ఊళ్ళకి వెలుతూంటాడు. మళ్ళీ యిల్లు చేరేసరికి పది పదిహేను రోజులు పడుతూంటుంది. అలాగే ఒకసారి వైజాగ్ క్యాంప్ వెళ్ళాడు. ఆ సమయంలోనే ఆనంద్ మేనమామ హైదరాబాద్ వచ్చి ఆనంద్ యింటికి ఫోన్ చేశాడు. అవని తన భర్త వైజాగ్ వెళ్ళినట్లు చెప్పి, ఆయన్ని వెంటనే యింటికి వచ్చేయమంది. ఆనంద్ మామయ్య తను రైల్వేస్టేషన్ నుంచే ఫోన్ చేస్తున్నానని, ఈసారి ఎప్పుడైనా ఆనంద్ ఊళ్ళోవున్నప్పుడు, వస్తానని చెప్పాడు.

అవని 'అదేమిటి బాబయ్యగారూ! నేను మీ అమ్మాయి లాంటిదాన్నే. మీరు తప్పక రావాలి" అంది.

"సరే వస్తున్నా"నన్నాడు ఆనంద్ మేనమామ.

అసలు అవని అంతగా చెప్పకపోయినా, వచ్చేసేవాడే ఆయన.

వస్తూనే కాఫీ తాగాడు, ఆనంద్ మామయ్య.

అబ్బా అని ఒకసారి ఒళ్ళు విరుచుకుని "ఈ వెధవ ప్రయాణాలు యిదివరకట్లా కాదమ్మా" అన్నాడు.

పాపం! అవని ఒక మాలోకం వెంటనే, "అవునండి బాబయ్యగారు" అంది.

ఇక మొదలు పెట్టాడు ఆనంద్ మామయ్య "విజయవాడ ఒక అరగంట ముందు వచ్చేసింది రైలు! బాగానే వుంది అనుకున్నాను. భోజనం చేసి పడుకున్నాను. ఒకటే అలసట, మెళకువ వచ్చేసరికి పొద్దున్న అయిదు అయ్యింది. అప్పటికి రైలు కాజీపేట వచ్చింది. ఎక్కడ, ఎలా లేటయిందో తెలియదు! డ్రైవరు చూస్తే ముందెక్కడో యింజన్లో వుంటాడు! మనం చూస్తే వెనకాల భోగిలో ఉన్నాం! అందునా నిద్దట్లో!" అన్నాడు. పాపం అవనికి ఇదంతా ఏమిటో అర్థం కాలేదు.

'డ్రైవర్ దగ్గర్లో ఉంటే, ఏం చేసేవాడో బాబయ్యగారు' అనుకుంది. ఇలాగ వచ్చినప్పటినుంచీ ఒక అరగంట చెప్పినది, చెప్పకుండా చెప్పి తినేసాడు. వినకపోతే బాగుండదు! ఆయన అవని పెళ్లైన తరువాత మొదటిసారి వచ్చారు కదా అని, అక్కడే వెర్రిమొహం వేసుకు కూర్చుంది, అవని.

"ఇప్పుడు వేడ్నీళ్ళు అవీ ఏం వద్దమ్మా! నేను చన్నీళ్ళు చేసేస్తా" అన్నాడు ఆయన. "అయ్యో అసలే శీతాకాలం! చన్నీళ్ళు చెయ్యడమేమిటి బాబయ్యగారు. ఒక్క పదినిమిషాల్లో వేడ్నీళ్ళు తయారైపోతాయి. ఈలోపులో యింకోసారి కాఫీ తాగండి" అని కాఫీ తెద్దామని లోపలికి వెళ్ళింది. ఆనంద్ మామయ్య చెప్పిన ఆ వెధవ ప్రయాణాల గోలలో ఆయనకోసం తెప్పించిన రెండు లీటర్ల పాలు, ఒక మీసాల పిల్లి తాగేసింది.

"ఉష్షు! ఉష్షు వెధవ పిల్లి!" అని అవని తిడుతూంటే, ఆనంద్ మామయ్య వంటింట్లోకి వచ్చి, ముక్కు మీద వేలు వేసుకుని, "అరెరే! ఈ భాగ్యనగరపు అభాగ్యపు పిల్లులు అంతరించిపోనూ! ఆకాశం చిల్లులు పడా!" అన్నాడు.

ఈ పిల్లులు నశించిపోవడము, ఆకాశం చిల్లులుపడడం ఏమిటో అవనికి తెలీలేదు. అయినా వెర్రిమొహం వేసుకుని ఊరుకుంది. 'ఏమిటి బాబయ్యగారూ!' అని అడిగితే, భూదేవిని కూడా ఏదైనా అంటాడేమోనని భయపడింది.

"బాబయ్యగారూ! మీరు పేపర్ చూస్తూ ఉండండి. దగ్గర్లోనే పాలు తీసుకొస్తా" అని బయటికి వెళ్ళింది.

ఆనంద్ మామయ్య రెండోసారి కాఫీ తాగి, శుభ్రంగా వేడ్నీళ్ళు పోసుకుని, ఫలహారం కడుపుమానం తెలీకుండా తిని పడుకున్నాడు.

పడుకునేముందు, "అసలీ వెధవ ప్రయాణాలు చెయ్యకూడదు!" అని మొదలు పెట్టబోయాడు.

"కాసేపు విశ్రమించండి, బాబయ్యగారూ!" అంది అవని.

పక్కింటి పంకజాక్షిగారు "మీ యింటికి ఎవరో వచ్చినట్లున్నారు" అంటూ, ఒక పావుకిలో కాఫీ ఫొడరు, ఒక గ్లాసుడు పాలు అప్పు తీసుకుపోయింది. వెర్రి అవని అంది. "పిన్నిగారూ! మీకు కావాలంటే, పంచదారకూడా తీసుకెళ్ళండి. మీ అబ్బాయి క్యాంప్‌కి వెళ్ళే ముందు అన్ని సరుకులూ యింట్లోకి సమృద్ధిగా తెచ్చారు".

"ఔను మరచిపోయాను సుమా! రెండు పెద్ద గ్లాసులు పంచదార కూడా యియ్యమ్మా! పంచదార కూడా నిండుకున్నట్లుంది" అంది పంకజాక్షి. ఈవిడ ప్రత్యేకతేమంటే సరుకు ఏదైనాగానీ, 'నిండుకుంది' అంటుంది. సాధారణంగా బియ్యం, పసుపు వగైరాకి 'నిండుకుంది' అనడం సహజం, కాని పంకజాక్షిగారింట్లో అన్నీ నిండుకుంటాయి. ఎందుకు నిండుకోవు! యిరుగు పొరుగు దగ్గర అప్పులు చేసి డబ్బాలలో పోస్తుంటే అవి తప్పక నిండుతాయి! అదేనేమో నిండుకోవడం అంటే!

ఆనంద్ మామయ్యకి ఆకలేసిందేమో నిద్ర నుంచి లేచాడు. "బాబయ్యగారూ కొంచెం మంచినీళ్ళు తాగుతారా!" అంది. "అవనీ! ఎంతయిందమ్మాటైమ్!" అన్నాడు. "పన్నెండున్నర" అంది.

"ఇప్పుడు మంచినీళ్ళు తాగితే అన్నం తినలేను. వద్దమ్మా" అన్నాడు.

తరువాత కొంచెంసేపటికి "అన్నంవడ్డించెయ్యి" మన్నాడు. అన్నం తింటుంటే పులమారింది. మంచినీళ్ళు తాగమంది అవని. 'వద్దమ్మా అన్నం సహించదు" అన్నాడు. కొంతమంది అంతే! మొత్తం కడుపంతా అన్నంతోనే నింపుతారు, ఎక్కడికైనా వస్తే.

"పదార్థములు బాగున్నవి. అబ్బ ఎలా చేసావమ్మా! ఇంత తక్కువ వ్యవధిలో" అన్నాడు. తక్కువ వ్యవధేమిటో. నాలుగ్గంటలు నిద్రతీసాడు.

"అబ్బ ఈ చారు ఎలా పెట్టావమ్మా!"

వెధవ చారు! నీళ్ళలో చింతపండేసి మరగపెడితే దానంతటదే ఒక రూపం దాలుస్తుంది. దీనికి కూడా మెచ్చుకోవడమే! అదే కొంత మంది ఘనత! ఎదుటివాళ్ళని అయిన దానికీ కానిదానికీ పొగుడుతూ, కాలక్షేపం చేసేస్తారు. అన్నం తినేసి మళ్ళీ మంచమెక్కేసాడు. మళ్ళీ యింకో నాలుగు గంటలు నిద్ర తీసాడు. మళ్ళీ 'ఈ వెధవ ప్రయాణాలు" అంటూ లేచాడు.

'అసలీయన హైదరాబాద్ వెధవ ప్రయాణం చేస్తూ, ఎందుకు వచ్చాడో!' అనుకుంది అవని.

అడిగితే బాగుండదు! అందునా మొదటిసారి తన యింటికి వచ్చాడు.

"బాబయ్యగారు! మీ మేనల్లుడికి ఫోన్ చేస్తాను మీరు వచ్చినట్లు, తెలిస్తే వెంటనే వచ్చేస్తారు" అంది అవని.

"ఎందుకమ్మా ఫోన్ నేనింకా ఒక వారం ఉంటాను. వాడు, నేను వెళ్ళే లోపుల రాకపోతే అప్పుడే చూద్దాం" అన్నాడు ఆనంద్ మామయ్య.

మొత్తం మీద ఒక వారం ఉంటాడని తెలిసింది. ఈ రకంగా పొద్దున్న వేడ్నీళ్ళు, టిఫెన్, మధ్యాహ్నం మంచి భోజనం వగైరాతో నాలుగు రోజులు గడిపేసాడు.

ఒకరోజు పొద్దున్నే పంకజాక్షి వచ్చి అవనితో అంది. "ఏమమ్మా! మీవారి మేనమామ అసలేం పనిమీద వచ్చాడు. ఇంకా ఎన్నాళ్ళుంటాడు. అసలే ధరలు మండిపోతున్నాయి. ఇలా అయితే సరుకులన్నీ అయిపోయి సంసారం గుండమయిపోతుంది. ఇలా చెప్పానని ఏమీ అనుకోకు సుమా! తొందరగా పంపించెయ్యి" అని చెప్పింది. ఈ మాటలు విన్న పంకజాక్షిగారి భర్త "ఆయన వాళ్ళింట్లో వుంటే నీకెందుకే" అన్నాడు.

"నాక్కాకపోతే యింకెవరికి? వాళ్ళింట్లో సరుకులన్నీ అయిపోతే నేనెక్కడికి వెళ్ళి సరుకులు అప్పుతేను! మన సంసారం ఎలా నడుస్తుంది. మీరింత తెలివితక్కువ వారవడం వల్లే, మావాళ్ళు అతి తక్కువ కట్నం యిచ్చినా మా సంబంధం ఒప్పుకున్నారు" అని భర్తని కేకలేసింది, పంకజాక్షి.

ఒకరోజు బయటికి వెళ్ళిన ఆనంద్ మేనమామ అదరా, బదరా వచ్చి అర్జంటుగా కోల్‌కతా వెళ్ళాలి, నీదగ్గర అయిదువేలుంటే యిమ్మన్నాడు. ఏం ముంచుకొచ్చిందో! అడిగితే బాగుండదని, బ్యాంక్ నుంచి డబ్బు తీసుకుని బయటనుంచే తన భర్తకి ఫోన్ చేసింది అవని. ఆ సమయంలో భర్త ఫోన్లో దొరకలేదు. ఆలస్యం చేస్తే బాగుండదని డబ్బు యిచ్చి ఆనంద్ మేనమామని సాగనంపింది అవని. తరువాత మళ్ళీ ఫోన్ చేసి యిలా అయిదువేలు అతని మేనమామకి యిచిచ్చనట్లు చెప్పింది. ఫోన్లో కేకలేస్తే బాధపడుతుందని ఊరుకున్నాడు ఆనంద్.

ఆరోజు రాత్రి, ఆనంద్ కజిన్ ముంబయి నుంచి ఫోన్ చేశాడు. 'ఆనంద్ మామయ్య ప్రస్తుతం దేశ సంచారంలో ఉన్నాడని, హైదరాబాద్ కూడా రావచ్చని, డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉండమని' అవనికి చెప్పాడు.

'ఇంకేం జాగ్రత్త! అంతా అయిపోయింది. జరిగిన పెళ్ళికి బాజాలలాగా, యిప్పుడీయన ఫోనొకటి' అనుకుంది అవని.

క్యాంప్ నుంచి వచ్చిన ఆనంద్ "భోజనాలు పెడితే పెట్టావు. ఆ అయిదువేలు దక్షిణ ఎందుకిచ్చావని" కేకలేసాడు.

"నాకేం తెలుసు మీ మేనమామ యింత ఘనుడని, మీరు ముందే చెప్పవలసింది" అని, అవని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ముందు అంటే, పెళ్ళికి ముందు చెప్పాలా! నాకు మేనమామ పోలికలుండవచ్చునని నిన్ను నాకివ్వకపోతే, నాకెంత నష్టం! నీకు గుర్తుందో లేదో. మన పెళ్ళైన కొత్తలో 'రాకోయి బంగారు మామా' అని పాడుకునేవాడ్ని. నువ్వేమో "రావోయి బంగారు మామ" అనే ఆ మధురమైన ఘంటసాల పాటని ఎందుకు ఖూనీ చేస్తురనేదానివి. అప్పుడలా ఎందుకు పాడేవాడ్నో చెపుతా విను. మా అమ్మమ్మకి ఒక్కగానొక్క కొడుకు. అతన్ని 'బంగారం' అని ముద్దుగా పలిచేదట. మేం కూడా మా మామయ్యని "బంగారు మామా" అని పిలిచేవాళ్ళం. పోను, పోను మామయ్య చేసే తికమక పన్లు చూసి, అందరూ విసిగిపోయాం, అసలు మా మామయ్య వస్తేనే ఒక తలనొప్పి! అందుకనే "రాకోయి బంగారు మామా" అని పాడుకునే వాళ్ళం. పెళ్ళిళ్ళలో అయితే రాకోయి బంగారు మామా అని బృందగానంతో ఏడిపించేవాళ్ళం" అని వివరించాడు ఆనంద్.

"సరే చాలా బాగుంది" అని తన భర్తకి మేనమామ పోలికలు రానందుకు సంతోషించింది అవని.

(ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక, 17-2-2005)